న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా పల్లకీ సేవ



పల్లకీలో స్వామి అమ్మవారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు శుక్రవారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

వీరారెడ్డి ఇంట్లో సోదాలు



వీరారెడ్డి ఇంటి వద్ద పోలీసుల సోదాలు

దొర్నిపాడు: వెల్త్ అండ్ హెల్త్ స్కీంలో భాగంగా దొర్నిపాడులో చాలా మంది నిరుద్యోగులు ఉద్యోగాల పేరిట మోసపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు బాధ్యుడు వీరారెడ్డి ఇంటితో పాటు బంధువుల ఇళ్లలో ఆదివారం డీఎస్పీ ప్రమోద్ బృందం సోదాలు చేశారు. తనిఖీల్లో ప్రామీసరి నోట్లు, విలువైన ఆస్తి పత్రాలు, ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు దొరికినట్లు తెలిసింది. బాధితుల నిరసన తెలుపుతున్న సమయంలో సమస్య పరిష్కారానికి రెండు వారాలు గడువు ఇవ్వాలని కోరడంతో నిరసనను విరమించారు. డీఎస్పీ వెంట సీఐలు మురళీధర్‌రెడ్డి, హనుమంత్‌నాయక్, ఎస్‌ఐలు రామిరెడ్డి, వరప్రసాద్ ఉన్నారు.

గైనకాలజీ పీజీ సీట్లు పెరుగుదల


కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో గైనకాలజీ విభాగానికి మరో నాలుగు పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఈ విభాగంలో 18 పీజీ సీట్లు ఉండగా పెరిగిన నాలుగు సీట్లతో కలిపి 22కు చేరాయి.

ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

కర్నూలు సిటీ: ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను ప్రభుత్వం అమలు చేయాలని ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ కోరారు. ఆదివారం ఏపీ హెచ్ఎంఏ భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వై.నారాయణ అధ్యక్షతన వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను గ్రేడ్ -1గా ఉన్నతీకరించాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలకు ఒక డిజిటల్ అసిస్టెంట్‌ను కేటాయించి ప్రధానోపాధ్యాయులకు పని భారం తగ్గించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్ల వేతనాలు రెగ్యులర్‌గా చెల్లించాలని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న వంట సహాయకులను విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు పెంచాలని, 9, 10 తరగతుల విద్యార్థుల మెస్ బిల్లులు చెల్లించాలన్నారు. ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పి.చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హుసేన్, ఆర్థిక కార్యదర్శి రమేష్ నాయుడు, కార్యవర్గ సభ్యులు రమేష్, శ్రీనివాసయాదవ్, రామచంద్రారెడ్డి, అస్లాం, ఎంఈఓ-2 ఆదాం బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల్లో ఒకటే దిగాలు!

- ఇదేనా రాష్ట్ర ప్రభుత్వ తీరు అంటూ ఆగ్రహం
- ఒక్క డీఏ ఇవ్వడంపై సర్వత్రా ఆందోళన
- 12వ పీఆర్‌సీ ఎప్పుడు అంటూ ప్రశ్నలు
- మధ్యంతర భృతి లేకపోవడంపై నిరుత్సాహం
- ఒక్క డీఏ కోసం సీఎంతో చర్చలు అవసరమా?
- ఉద్యోగ సంఘాల నాయకుల అసంతృప్తి



కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో మెరుగైన పీఆర్‌సీ, ఎప్పటికప్పుడు డీఏలు ఇస్తామని 2024 మే నెలలో జరిగిన ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ఎన్నెన్నో హామీలు ఇచ్చి అరచేతిలో స్వర్గం చూపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు దాటి పోయింది. అయితే ఉద్యోగ సంఘాలకు ముఖ్యమంత్రి దర్శనమే లేకుండా పోయింది. ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడం మినహా ఒక్క ఆర్థిక సమస్య కూడా పరిష్కరించలేదు. ఇది ఉద్యోగులకు తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని కలిగించింది. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల్లో వ్యతిరేకత వచ్చింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తుండటంతో ఉద్యోగుల్లో ఉన్న వ్యతిరేకతను తగ్గించుకునేందుకు కూటమి ప్రభుత్వం హడావుడిగా ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలిచింది. ముఖ్యమంత్రి స్థాయిలో సమావేశం కావడంతో పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో రెండు డీఏలు ఇస్తారని, పీఆర్‌సీ కమీషన్‌పై ప్రకటన చేస్తూ 30 శాతం ఐఆర్ ఇస్తారని, మిగిలిన డిమాండ్‌లపై రూట్ మ్యాప్ ప్రకటిస్తారని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు ఆశించాయి. స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడే ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపినా చేకూరిన ప్రయోజనం నామమాత్రమే. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా చర్చలు జరిగాయని ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల్లో ఆందోళన వెల్లువెత్తుతోంది.

ఒక్క డీఏకే ఇంత హంగామా!

ఉద్యోగులకు సంబంధించి 2024 జూన్ నెలకు ఒక్క డీఏ కూడా పెండింగ్‌లో లేదు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత 2025 జూలై వరకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే 16 నెలల తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతో సమావేశమైన ముఖ్యమంత్రి ఒక్క డీఏ మాత్రమే ఇచ్చారు. అయితే ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల నేతలు మాత్రం ఒక్క డీఏకే పొంగిపోతున్నాయి. ప్రభుత్వాన్ని పొగుడుతూ.. ప్రకటనలు కూడా ఇవ్వాలని ఆయా సంఘాల అధ్యక్షులు జిల్లా నాయకులకు సూచనలు ఇవ్వడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. 12 పీఆర్‌సీ ఊసే లేదు. మధ్యంతర భృతి మాటనే లేదు. ఒక్క డీఏకే ఇంత హంగామా ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఇదేనా పండుగ అంటే!

కూటమి ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంత్రే ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరుపుతున్నారంటే అంచనాలు భారీగా ఉంటాయి. కానీ అంచనాలన్నీ తుస్సుమన్నాయి. ఇప్పటికే ఎంతో నష్టపోయాం. ఇంకా ఎన్ని ఇబ్బందులు పడాలని ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా కేంద్రాల్లో ఉన్న ఈహెచ్‌ఎస్ రెఫరల్ ప్రయివేటు ఆసుపత్రుల్లో హెల్త్ కార్డుల ద్వారా వైద్య సేవలు ఆగిపోయాయి. దీని ప్రస్తావనే లేకపోవడం ఉద్యోగులకు ఆందోళన కలిగిస్తోంది. పోలీసులకు మాత్రమే ఆర్జన్డ్(ఈఏఆర్‌ఎన్‌ఈడీ)లీవ్స్ ఎన్‌క్యాష్‌మెంటు అనడం ఎంతవరకు న్యాయమనే ప్రశ్న ఉత్పన్నమైంది. మిగిలిన వారు ఉద్యోగులు కాదా.. వారు ప్రభుత్వంలో భాగస్వాములు కాదా అనే చర్చ జరుగుతోంది. ఇలాగైతే దీపావళి పండగను ఎలా ఘనంగా జరుపుకుంటారో పాలకులకే తెలియాలనే ప్రశ్నలు వస్తున్నాయి.

ఉద్యమం ఆగదు



డిమాండ్‌లను సాధించుకునేందుకు మొదట ఉద్యమాన్ని లేవదీసింది ఉపాధ్యాయ సంఘాలే. ఎట్టకేలకు 16 నెలల తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరుపడటం సంతోషాన్ని ఇచ్చింది. అయితే చర్చలు మాకు సంతృప్తిని ఇవ్వలేదు. ముఖ్యమంత్రితో చర్చలంటే దాదాపు అన్ని డిమాండ్‌లకు పరిష్కారం లభించాలి. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉండగా.. కేవలం ఒక్క డీఏ మాత్రమే ఇవ్వడం తీవ్ర నిరాశను మిగిల్చింది. 12వ పీఆర్‌సీ లేదు. ఐఆర్ ఊసే లేదు. ముఖ్యమంత్రితో జరిపిన చర్చలు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉంది. పీఆర్‌సీ, ఐఆర్ సాధించుకునేందుకు మా ఉద్యమం ఆగదు.

– హృదయరాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

చాలా బాధాకరం



కేవలం ఒక్క డీఏకు ఉద్యోగ సంఘాల నేతలు సంబరపడుతుండటం చూస్తుంటే బాధ కలుగుతోంది. ప్రభుత్వంతో కోట్లాది రూపాయల విలువ చేసి డిమాండ్‌లు సాధించుకున్నాం అన్నట్లుగా ఉద్యోగ సంఘాలు గొప్ప స్టేట్‌మెంట్లు ఇస్తుండటం దారుణం. ఒక్క డీఏతో సంబరపడిపోతూ.. ఈ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులంతా సంతోషంగా ఉన్నారనే విధంగా ప్రకటనలు ఇస్తుండటం చూస్తే బాధేస్తోంది. ఇప్పటికైనా మిగిలిన మూడు డీఏలు, పీఆర్‌సీ, ఐఆర్ ఇతర డిమాండ్‌లు సాధించుకోవడానికి ఉద్యమించాల్సిన అవసరం ఉంది.

– గిరికుమార్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం, కర్నూలు

వివక్ష తగదు



ఉపాధ్యాయుల సరండర్ లీవ్‌ల బిల్లులు పెండింగ్ లోనే ఉండిపోయాయి. వాటిపైన ప్రతి ఏడాది ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారు. అయినప్పటికీ వారి ఖాతాల్లో ఇంతవరకు సరండర్ లీవ్స్ మొత్తం క్రెడిట్ కాలేదు. పోలీసులకు విడతల వారీగా సరండర్ లీవ్ బకాయిలు చెల్లిస్తామని ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా ప్రభుత్వం ఉచిత పథకాలకు నిధులు ఖర్చు చేస్తున్న విధంగానే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు పెండింగ్ బకాయిలను ఇవ్వాల్సిందే.

– కరుణానిధి మూర్తి, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

నాలుగు డీఏలు ఇవ్వాలి




కూటమి ప్రభుత్వంపై ఉద్యోగుల్లో వ్యతిరేకత ఉంది. ఈ నేపథ్యంలో ఉద్యోగులతోముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరుపడం హర్షణీయమే. కాని ఉద్యోగులు ఆశించిన రీతిలో డిమాండ్‌లకు ఆమోదం లభించలేదు. సరండర్ లీవ్‌లు ఒక్క పోలీసులకు మాత్రమే ఇస్తామనడం తగదు. ఇతర ఉద్యోగుల పరిస్థితి ఏమిటి? పోలీసులతో సమానంగా అందరికీ సరండర్ లీవ్‌లు మంజూరు చేయాలి. ఒక్క డీఏ మాత్రమే ఇవ్వడం దరదృష్టకరం. పెడింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు ఇవ్వాలి. – సర్దార్ అబ్దుల్ హమీద్, ఆల్ ఇండియా డ్రైవర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు


మోదీ పర్యటనలో భద్రత డొల్ల

- కళ్లు మూసుకుని పాస్‌ల జారీ
- ఒక్కొక్కరికీ వేర్వేరు హోదాలో రెండు పాసులు
- ప్రధాని సమీపంలోకి ఒకరి బదులు ఇంకొకరు
- బాధ్యులపై చర్యలకు మీనమేషాలు


ఆత్మకూరురూరల్: అత్యున్నత స్థాయి భద్రతా వలయంలో ఉండే దేశ ప్రధాని సమీపంలోకి టాంపర్ పాస్‌లతో ఇద్దరు వ్యక్తులు వెళ్లడం సంచలనంగా మారింది. వీవీఐపీల భద్రత ప్రమాణాలపై పెద్ద ప్రశ్న తలెత్తుతోంది. ఈ అంశంపై మరింత లోతుగా పరిశీలిస్తే మరిన్ని భద్రతా లోపాలు బయటపడుతున్నాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం పర్యటనలో పాల్గొన్న కొందరు రెండు పాస్‌లు కలిగి ఉండి వేర్వేరు చోట్ల ఆయనకు దగ్గరగా వెళ్లారు. జిల్లా భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు గుండాల మధుసూదన్ రావు పేరుతో ఒక పాస్ తీసుకుని సున్నిపెంట హెలిపాడ్ వద్ద ప్రధానిని స్వాగతించాడు. అలాగే అభిరుచి మధు పేరుతో మరొక పాస్ తీసుకుని ప్రధానికి హెలిపాడ్ వద్ద వీడ్కోలు పలికారు. అలాగే మోమినా షబానా స్టేట్ బీజేపీ మైనార్టీ మోర్చా ఇన్‌చార్జ్‌గా ఒక పాస్ పొంది శ్రీశైలంలోని శ్రీభమరాంబా ఆలయం వద్ద ప్రధానికి స్వాగతం పలికే బృందంలో ఉన్నారు. అలాగే మోమిన్ షబానా బీజేపీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరుతో మరో పాస్ తీసుకుని సున్నిపెంట హెలిపాడ్ వద్ద ప్రధానికి వీడ్కోలు పలికే బృందంలో చేరారు. ఇంత సులువుగా రెండు పాస్‌లు పొంది రెండు వేర్వేరు చోట్ల ప్రధానికి అత్యంత సమీపంలో సంచరించే అవకాశం పొందడం వీవీఐపీ భద్రత లోపాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతోంది. అలాగే ముఖ్య నాయకుల పేర్లను వాడుకుని పాస్‌లు పుట్టించుకుని ఇతరులు వీవీఐపీని అనుసరించవచ్చునని తేటతెల్లమవుతోంది. ఇంత పెద్ద భద్రతా లోపాలపై అధికారులు ఎవరూ పెదవి విప్పక పోవడం, ఎవరిపై చర్యలు తీసుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది. భద్రతా లోపాలకు కారణాలేమిటో గుర్తించి కారకులపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



3. Smt. Rajakumari Ganiya, Collector & District Magistrate
4. Shri Suneel Sheoran, Superintendent of Police, Nandyal
5. Shri Abhiruchi Madhu, BJP District President, Nandyal
6. Shri Inty Adinarayna, ex-Parliament Coordinator, BJP
7. Shri Boreddy Lakshmi Reddy, BJP Leader, BJP

సున్నిపెంట హెలిపాడ్‌లో సీ - ఆఫ్ పాస్ లిస్ట్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా అభిరుచి మధు పేరు


9. Shri T G Venkatesh, ex-MP Rajyasabha, BJP
10. Shri Y Raghavalu, Sr. Leader BJP
11. Shri Guntala Madhusudhan Rao, District President, Nandyal, BJP
12. Sri Budda Srikanth Reddy, State Executive, BJP

హెలిపాడ్ స్వాగత బృందం పాస్‌లో 11 వరస సంఖ్యలో బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గుండాల మధుసూదనరావు పేరు


6. Shri M Hari Jawaharlal, Principal Secretary, Endowments Department
7. Shri K. Ramachandra Mohan, Commissioner, Endowments Department


11. Shri Akkannagari Siva Krishna, District General Secretary
12. Shri Viswaroopa Achari, Senior Leader, BJP
13. Smt. Shabana, State Minority Morcha Incharge, BJP
14. Shri Mayaluri Venkatesh, District Vice President, BJP

భ్రమరాంబ ఆలయం వద్ద ప్రధానిని స్వాగతించే బృందం పాస్‌లో, సున్నిపెంట హెలిపాడ్‌లో ప్రధానికి వీడ్కోలు తెలిపే బృందం పాస్‌లో వేర్వేరు హోదాలతో షబానా పేరు

నీ వెంటే నేను..

- భార్య మృతి చెందిన గంటలోనే భర్త మరణం
- ఒకే రోజు వృద్ధ దంపతుల మృతి



అరవేటి లక్ష్మీనారాయణ, వెంకటలక్ష్మమ్మ (ఫైల్)

ప్యాపిలి: దాదాపు ఆరు దశాబ్దాల పాటు కష్ట సుఖాల్లో ఒకరినొకరు తోడుగా నిలిచారు. వృద్ధాప్యంలో సైతం అన్యోన్యంగా ఉంటూ కాలం వెళ్లదీశారు. మరణం సైతం వీరిని వీడయలేదు. నీ వెంటే నేనంటూ గంటల వ్యవధిలో ఇద్దరు తనువు చాలించారు. ఈ విషాద ఘటన ఆదివారం ప్యాపిలిలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన అరవేటి లక్ష్మీనారాయణ (90), వెంకటలక్ష్మమ్మ (77) దంపతులు అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. వీరికి నలుగురు కుమారులు సంతానం కాగా వారిలో ఇద్దరు కుమారులు కొద్ది సంవత్సరాల క్రితం మృతి చెందారు. ఒక కుమారుడు ఉద్యోగరీత్యా బెంగళూరులో స్థిరపడ్డాడు. మూడో కుమారుడు సతీశ్ తల్లిదండ్రులతో కలసి ప్యాపిలిలో ఉంటున్నాడు. కొంతకాలంగా లక్ష్మీనారాయణ, వెంకటలక్ష్మమ్మలు వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. భర్త లక్ష్మీనారాయణకు సపర్యలు చేస్తూ అతనికి చేదోడువాదోడుగా ఉంటున్న భార్య వెంకటలక్ష్మమ్మ ఆదివారం ఉదయం 6 గంటలకు మృతి చెందారు. విషయం తెలిసిన భర్త లక్ష్మీనారాయణ తీవ్ర మనస్తాపానికి గురై 10.30 గంటల సమయంలో మృతి చెందారు. అరవేటి లక్ష్మీనారాయణ నంద్యాల, నందికొట్కూరు, మద్దికెర తదితర ప్రాంతాల్లో లైబ్రేరియన్‌గా పని చేసి 1993లో పదవీ విరమణ పొందారు. ఒకే రోజు భార్యాభర్తలు గంటల వ్యవధిలో మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది.

పీపీపీతో మెడికల్ కళాశాలలు బినామీలకు ధారాదత్తం

- జేబులు నింపుకునేందుకు కూటమి నేతల కుట్ర
- ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



బొమ్మలసత్రం: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను బినామీలకు ధారాదత్తం చేసేందుకు కూటమి నేతలు పీపీపీ విధానాన్ని తెరపైకి తెచ్చారని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా విమర్శించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్య, వైద్య విధానాల్లో దేశంలోనే కనీవినీ ఎరుగని రీతిలో మార్పులు తీసుకొచ్చిన ఘనత ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో నూతనంగా 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టి ఐదు ప్రారంభించారన్నారు. పాడేరు లోని మెడికల్ కాలేజీ ఇటీవల ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తి దశ లో ఉన్న 11 మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. జేబులు నింపుకునేందుకు కూటమి నేతలు బరితెగించారన్నారు. ఎన్నికల ముందు సంపద సృష్టిస్తామని చెప్పిన వారు నేడు సూపర్ సిక్స్‌ను అమలు చేయాలంటే తమ వద్ద అంత సంపద లేదని చెబుతుండటం పేదలను మోసం చేయడమేనన్నారు. వివిధ దశల్లో ఉన్న 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు రూ. 5 వేల కోట్లు అవసరం ఉందని, ఆ నిధులను సమకూర్చకుండా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలనుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. పేదల కోసం తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎందాకైనా పోరాడతారని, ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటు పరం చేసినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంతో కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామన్నారు.

ఉమ్మడి జిల్లా టేబుల్ టెన్నిస్, ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 21వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్, ఫెన్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విశ్వనాథ్ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాల బాలికలకు టేబుల్ టెన్నిస్ ఫెన్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయి ఎలిజిబులిటీ ఫారం, ఎండీఎం ఫారం, సీబీఎస్‌ఈ విద్యార్థులు అయితే డిక్లరేషన్ ఫారం, ఆధార్ కార్డు జిరాక్స్, పుట్టిన తేదీ పాఠశాల రికార్డుతో హాజరు కావాలన్నారు. టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు వ్యక్తిగత కిట్టుతో, ఫెన్సింగ్ క్రీడాకారులు, ఎలక్ట్రానిక్ ఎక్వుప్‌మెంట్‌తో హాజరు కావాలన్నారు.

హ్యాండ్‌బాల్ కార్యవర్గం ఎన్నికలకు సిద్ధం కండి

కర్నూలు (టౌన్): రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు సూచించారు. ఆదివారం నగరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హ్యాండ్‌బాల్ ఫెడరేషన్లు రెండుగా చీలిపోయాయన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో 2021 నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఇండియాకు గుర్తింపు లేదన్నారు. ఒలింపిక్ సంఘం పరిశీలకులుగా రామాంజనేయులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ సభ్యులు గుడిపల్లె సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై విస్తృత అవగాహన

- డిప్యూటీ కమిషనర్ మురళీ మనోహర్



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ మురళీ మనోహర్

నంద్యాల: జిల్లాలో జీఎస్టీ 2.0 (సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్) సంస్కరణలపై నెల రోజుల పాటు ప్రజల్లో విస్తృతతంగా అవగాహన కల్పించాలని వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్, నోడల్ అధికారి మురళీ మనోహర్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జీఎస్టీ 2.0 (ఉత్సవ్) అవగాహన కార్యక్రమాల ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రాజకుమారి, జేసీ కొల్ల బత్తుల కార్తీక్ మార్గదర్శకత్వంలో జిల్లాలోని అన్ని విభాగాల సహకారంతో జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. జీఎస్టీ సంస్కరణలు వ్యాపారులు, వినియోగదారుల మధ్య సులభమైన పన్ను విధానం, పారదర్శకతను తీసుకురావడమే లక్ష్యమని వివరించారు. గతంలో ఉన్న నాలుగు జీఎస్టీ స్లాబ్‌లు (5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం)ను సంక్షిప్త పరిచి రెండు స్లాబ్‌లుగా మార్చడం, కొన్ని వస్తువులపై పన్ను పూర్తిగా తొలగించడం వంటి కీలక మార్పులను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 22వ తేదీ నుం,ఇ అమలు చేస్తున్న కొత్త జీఎస్టీ విధానం వల్ల నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలపై పన్ను తగ్గింపుతో ప్రజలకు నేరుగా లాభాలు కలుగుతున్నాయని వివరించారు. ప్రజలలో పన్నుల అవగాహన పెరగడంతో మార్కెట్‌లో పారదర్శకత, వినియోగదారుల విశ్వాసం పెరుగుతుందన్నారు. అంతకుముందు డీఈఓ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో సాంస్కృతిక, జీఎస్టీ అంశంపై విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు.

తుంగభద్ర నదికి 'రసాయన' ముప్పు

కర్నూలు సిటీ: రాయలసీమ అల్కాలీస్ కంపెనీలో చేపట్టనున్న విష రసాయన పరిశ్రమతో తుంగభద్ర నది జలాలు కలుషితం అవుతాయని జాతీయ అణు ఒప్పంద వ్యతిరేక వేదిక కో-కన్వీనర్ రవీంద్ర శర్మ అన్నారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో పర్యావరణంపై, మానవాళిపై విష రసాయనాలు, అణు పరిశ్రమల ప్రభావం అనే అంశంపై ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక బాధ్యులు శేషాద్రి రెడ్డి అధ్యక్షత వహించిన సదస్సుకు రవీంద్ర శర్మ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. అల్కాలీస్ రసాయనాలతో కర్నూలు, చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లోని ప్రజలకు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. సదస్సుల్లో రత్నం ఏసేపు, రామకృష్ణారెడ్డి, యోహాన్, ప్రతాప్‌రెడ్డి, మన్సూర్ అహమ్మద్ పాల్గొన్నారు.

తూకం ప్రకారమే కూలి!



కూలీలు తీసిన పత్తిని తూకం వేస్తున్న దృశ్యం

ఆలూరు: పొలంలో పత్తిని తీసేందుకు వచ్చిన కూలీలకు వారి తీసిన పత్తిని తూకం వేసి కూలి ఇస్తున్నారు. ప్రస్తుతం పత్తి కోతకు కూలీలను పిలిస్తే రోజుకు రూ.400 వరకు డిమాండ్ చేస్తున్నారు. అలా కాదంటే తాము తీసిన పత్తిని తూకం వేసి కిలోకు రూ.12 చెల్లించాలంటున్నారు. మొన్నటి వరకు కోస్తా, తెల్లంగాణ ప్రాంతాల్లో మాత్రమే ఈ పద్ధతి ఉండేది. ప్రస్తుతం ఈ విధానం జిల్లాకు వచ్చింది.

పేలుతున్న టపాసుల ధరలు!

- జీఎస్టీ తగ్గినా రేట్లు అధికమే
- కనీసం రూ.5 వేలు వెచ్చించాల్సి వస్తోందని ప్రజల ఆవేదన
- విపరీతమైన ధరలతో వేడుకలకు దూరంగా పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు



టపాసులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కర్నూలు(సెంట్రల్): బాణాసంచా ధరలు విపరీతంగా పెరిగాయి. ఏ రకం టపాసులను ముట్టుకున్నా షాక్ కొడుతున్నంత పని అవుతోంది. దీంతో దీపావళి పర్వదినాన పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు అటువైపు చూడాలంటే భయపడాల్సి వస్తోంది. కనీసంగా రూ.5 వేల వరకు క్రాకర్స్ కోసమే ఖర్చు చేయాల్సి వస్తుండడంతో అయోమయంలో ఉన్నారు.

స్థానికంగా రేట్లు పెంచి..

దీపావళి పండుగ రోజున నరకాసుని వధ కోసం బాణాసంచాను పేల్చి సంబరాలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో బాణాసంచాను కుటుంబ సభ్యులందరూ ఒకచోటా చేరి పేల్చడం పారిపాటైంది. ఈ క్రమంలో ప్రజలకు అవసరమైన బాణాసంచాను అందుబాటులో ఉంచేందుకు 86 ఏళ్ల నుంచి ప్రభుత్వ పర్యవేక్షణలో క్రాకర్స్ మర్చంట్ అసోసియేషన్ స్టాళ్లను ఏర్పాటు చేస్తోంది. కర్నూలు, పత్తికొండ, ఆదోనిలలో ప్రజలకు అనువైన చోటా స్టాళ్లను ఏర్పాటు చేసి బాణాసంచాను పరిమితమైన రేట్లకు ఉంచుతున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది కర్నూలులో 100, ఆదోనిలో 15, పత్తికొండలో 4 బాణాసంచా స్టాళ్లను ఏర్పాటుచేశారు. గతేడాదితో పోల్చుకుంటే ఆయా పట్టణాల్లో స్టాళ్ల సంఖ్యను పెంచారు. ఇదేక్రమంలో స్టాళ్లలో బాణాసంచా రేట్లను కూడా విపరీతంగా పెంచడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతేడాదితో పోల్చుకుంటే ఏకంగా 25 శాతం వరకు రేట్లు పెరిగినట్లు వినియోగదారులు చెబుతున్నారు. దీంతో ఒక్కో కుటుంబంపై దాదాపు 3–5 వేల వరకు అదనపు భారం పడుతోంది. మరోవైపు స్థానిక క్రాకర్స్ మర్చంట్ ప్రోద్బలంతోనే రేట్లు పెంచి అమ్ముతున్నట్లు చెబుతున్నారు. ఈ స్టాళ్లలో షాపు ఏర్పాటు చేసుకోవాలంటే అసోసియేషన్‌కు రూ.20 వేలు, జీఎస్టీ పేరిట రూ.20 వేలు, మునిసిపాలిటీకి రూ.5 వేలు, అదనపు ఖర్చుల కింద రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆయా డబ్బులతో పాటు పెట్టుబడి, నాలుగు రోజుల నిర్వహణ ఖర్చులు, లాభాల కోసం రేట్లను పెంచి అమ్ముతున్నట్లు తెలుస్తోంది. కాగా, షాపుల్లో మాత్రం 80–90 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నా వినియోగదారుడికి మాత్రం రేట్లు తగ్గడంలేదు.

వ్యాపారాలు తగ్గాయంటున్న వ్యాపారులు

మరోవైపు తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయన్న ఆశతో అసోసియేషన్‌కు రూ.46 వేలు కట్టి స్టాల్‌ను ఏర్పాటు చేసిన వ్యాపారాలు జరగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. కర్నూలుకు సమీపంలోని వెల్దుర్తిలో క్రాకర్స్ తయారీ కేంద్రం ఉండడంతో వినియోగదారులతోపాటు వ్యాపారులు అక్కడికి వెళ్లి తెచ్చుకుంటున్నారు. దీంతో ఇక్కడ కంటే అక్కడే తక్కువ బాణాసంచా విక్రయాలు జరుగుతుండడంతో అక్కడే వెళ్లి తెచ్చుకుంటున్నారని, ఫలితంగా ఇక్కడ వ్యాపారాలు తగ్గినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో స్టాళ్ల ఏర్పాటు చేసుకున్న వారు కనీసం అసోసియేషన్‌కు చెల్లించినా డబ్బులైనా వస్తాయా లేదా అన్న మీమాంసలో ఉన్నారు.

గ్రీన్‌కాకర్స్‌ను మాత్రమే కాల్చాలి

జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు దీపావళి రోజున గ్రీన్ క్రాకర్స్‌ను మాత్రమే కాల్చేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లలో గ్రీన్ కాకర్స్‌ను మాత్రమే అమ్మేలా వ్యాపారులకు నిర్దేశం చేశారు. ఈ మేరకు కలెక్టరు, ఎస్పీ, జిల్లా అగ్నిమాపక అధికారి, ఆర్‌డీఓలు, కాలుష్య నియంత్రణ మండలి, మునిసిపల్ అధికారులు బాణసంచా వ్యాపారులతో సమావేశాలను నిర్వహించుకొని ప్రభుత్వం రూపొందించిన నియమ, నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. పండుగరోజున రాత్రి 8 నుంచి 10 గంటల మధ్య బాణసంచాను పేల్చాలని ప్రజలకు అధికారులు సూచిస్తున్నారు.

రేట్లు విపరీతంగా పెంచారు



రేట్లు తక్కువగా ఉంటాయని అనుకొని వస్తే విపరీతంగా పెంచారు. ఏదో రూ.5 వేల వరకు ఖర్చు అవుతుందనుకుంటే రూ. 20 వేలు ఖర్చైంది. పిల్లల కోసం తప్పడంలేదు. రేట్లు తగ్గించాలి. లేదంటే పేదలు, మధ్యత రగతి వర్గాల ప్రజలకు ఇబ్బంది అవుతుంది. – యోగేష్, కర్నూలు

నిరాశే కలిగింది



కర్నూలులో రేట్లు తక్కువగా ఉంటాయని ఇక్కడికి వచ్చాం. అయితే ఇక్కడ ఏది కొనాలని చూసినా రేట్లు షాక్ కొట్టేలా ఉన్నాయి. తీవ్ర నిరాశ మిగిలింది. గతంలో ఇంత రేట్లు ఉండేవి కావు. ఈసారి ఎందుకు పెంచారో అర్థం కావడంలేదు. రూ.5 వేల క్రాకర్స్ కోసం వస్తే రూ.20 వేల ఖర్చు వచ్చింది. – నాగరాజు, బజ

వ్యాపారాలు లేవు



నేను అసోసియేషన్‌లో ఉండి స్టాల్‌ను ఏర్పాటు చేశాను. అయితే వ్యాపారం పెద్దగా కనిపించడం లేదు. రెండు రోజుల నుంచి వ్యాపారం కోసం వేచి చూస్తున్నాం. సోమవారం ఒక్కరోజే వ్యాపారం కావాలంటే అనుమానంగా ఉంది. పెట్టుబడి కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఈ సంవత్సరం నష్టపోవాల్సి వస్తోంది. – కల్యాణ్, స్టాల్ నిర్వాహకుడు, కర్నూలు

టపా'కాసులు'.. బాణా'సంచు'లు



దీపావళి పర్వదినం ఆనందంగా జరుపుకునేందుకు నగర ప్రజలు సిద్ధమయ్యారు. పండుగకు రెండు రోజుల ముందు నుంచే బాణాసంచా కొనుగోలు చేస్తున్నారు. స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన క్రాకర్స్ దుకాణాలు రద్దీగా కనిపిస్తున్నాయి. చిన్నారులు, పెద్దలు ఆసక్తిగా రకరకాల టపాసులు కొనుగోలు చేస్తున్నారు. రేట్లు అధికంగా ఉన్నాయంటూనే కొందరు సంచులు, బ్యాగులు నింపుకుని వెళ్తున్నారు. కాగా మైదానంలో బాణాసంచా విక్రయాల సమయంలో పాటించాల్సిన నిబంధనలను వ్యాపారులు బేఖాతరు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



కిటకిటలాడుతున్న దుకాణాలు







ఎస్టీబీసీ కళాశాల మైదానంలో వెలిసిన టపాసుల దుకాణాలు

క్లుప్తంగా

27 నుంచి 'రాయలసీమ' కార్మికుల రిలే దీక్షలు



సంఘీభావం ప్రకటిస్తున్న కార్మికులు

ఆదోని సెంట్రల్: సమస్యల పరిష్కారానికి రాయలసీమ స్పిన్నింగ్ మిల్ కార్మికులు ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి వెంకప్ప తెలిపారు. ఆదోని రాయలసీమ మిల్లు కార్మికుల జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిల్లు మూతపడి 25 సంవత్సరాలు అవుతున్నారు 150 మంది కార్మికులకు పీఎఫ్, పెన్షన్ రాలేదన్నారు. సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకొని వెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఏఐకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఐఎఫ్‌టీయూ నాయకుడు నారాయణ, కార్మికులు కుమార్, మల్లికార్జున, రెడ్డి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దశలవారీగా పోరాటం



మాట్లాడుతున్న ఎండి అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల కోసం దశల వారీగా ఉద్యమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అంజిబాబు, పీఎస్ రాధాకృష్ణ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.నాగరాజు తెలిపారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగులతో ప్రభుత్వం జరిపిన చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వంలోకి తీసుకోవాలంటే మిన్నకుండిపోవడం అన్యాయమన్నారు.

జాతీయ షూటింగ్ పోటీలకు కర్నూలు శ్రీకర్



కర్నూలుటౌన్: జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు కర్నూలు షూటర్ శ్రీకర్ ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా రైఫిల్ షూటింగ్ సంఘం కార్యదర్శి ఎండీ బాషా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో నిర్వహించిన 16వ సౌత్‌జోన్ స్థాయి రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు షూటర్ శ్రీకర్ ప్రతిభ చూపారని తెలిపారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో 400 పాయింట్లకు 350 పాయింట్లు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

ఆలయ నిర్మాణానికి ఆదోని మాజీ ఎమ్మెల్యే విరాళం



నగదును విరాళంగా అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: మండలంలోని గణేకల్ గ్రామంలో ఉన్న బంగారమ్మవ్వ దేవాలయ నిర్మాణానికి ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రూ.1,01,000 విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అవ్వవారి ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఆలయ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. దేవత ఆశీస్సులు సాయిప్రసాద్‌రెడ్డిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మయ్య, ఉచ్చీరప్ప, లక్ష్మయ్య, గోపాల్, చిన్న ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి



మెరిట్ విద్యార్థినికి చెక్కును అందిస్తున్న తులసీ రామచంద్ర ప్రభు

కర్నూలు(అర్బన్): యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని తులసీ గ్రూప్ చైర్మన్ తులసీ రామచంద్ర ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో రాయల అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, శ్రీ కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్డ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద బలిజ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు కోనేటి చంద్రబాబు, మాజీ అధ్యక్షులు యర్రంశెట్టి నారాయణ రెడ్డి, రోపా అధ్యక్షులు చింతలపల్లి రామక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి కోనేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అందిస్తున్న స్కాలర్‌షిప్స్ ఉన్నత చదువులకు తోడ్పాటును అందిస్తుందన్నారు. బలిజ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి 180 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ.9 లక్షలను స్కాలర్‌షిప్స్ రూపంలో అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌరు జనార్దన్‌రెడ్డి, కొట్టే చెన్నయ్య, బాలరాజు, భాస్కర్‌బాబు, మల్లికార్జునమూర్తి, మలిశెట్టి దివాకర్, గాండ్ల లక్ష్మన్న, మండ్లెం రవి, సింగంశెట్టి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి బస్సుయాత్ర

ఆదోని సెంట్రల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 22వ తేదీ నుంచి నవంబర్ 12వ తేదీ వరకు ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు బస్సుయాత్ర చేపడుతున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా, నిర్మాణ బాధ్యులు గిడ్డయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదోని పట్టణంలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం పేరుతో మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ఆలోచనను తక్షణమే విరమించుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిలా ఆఫీస్ బేరర్స్ శరత్ కుమార్, రంగస్వామి, థామస్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

రైతు అదృశ్యం



వెంకటేశ్వర్లు (ఫైల్)

బండి ఆత్మకూరు: కడమల కాలువ గ్రామానికి చెందిన ఓ రైతు పొలానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని ఎస్ఐ జగన్‌మోహన్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన చాకలి పెద్ద వెంకటేశ్వర్లు (57) శనివారం సాయంత్రం పొలం దగ్గరకు వెళ్తున్నానని ఇంటిలో చెప్పి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టు చుట్టు పక్కల, బంధువుల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. అతని కుమారుడు చాకలి సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. వ్యక్తి దుర్మరణం

- ఇద్దరి పరిస్థితి విషమం

నంద్యాల(అర్బన్): నంద్యాల సమీపంలోని చిన్న చెరువు కట్ట వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన మల్లేష్, సువర్ణమ్మ పని మీద నంద్యాలకు వస్తుండగా, బొల్లవరం గ్రామానికి చెందిన హుసేన్‌బాషా నంద్యాలలో పనులు ముగించుకొని బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. చిన్న చెరువు కట్ట వద్దకు రాగా వేగంగా వస్తున్న రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హుసేన్ బాషా(37) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతూరు, కొడుకు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన మల్లేష్, సువర్ణమ్మను 108లో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీమ సాగునీటి హక్కుల పరిరక్షణే ధ్యేయం

- 24న నంద్యాలలో భారీ సభ
- సాగునీటి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



పాంప్లేట్లను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): సీమ సాగునీటి హక్కుల పరిరక్షణే రాయలసీమ సాగునీటి సాధన సమితి ధ్యేయమని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. రాయలసీమ నీటి హక్కులను రక్షించడం, సీమకు న్యాయం జరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈనెల 24న పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో భారీ సభ నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక సమితి కార్యాలయంలో ఆదివారం సమితి సభ్యులతో కలిసి సభ పాంప్లేట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం కోసం సీమ రైతులు 60 వేల ఎకరాలు త్యాగం చేసినప్పటికీ ప్రాజెక్టు రూపకల్పనలో సీమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అన్యాయాన్ని సరిదిద్దేందుకు నాలుగు దశాబ్దాల క్రితం ఎస్సార్బీసీ, హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా సుమారు 3 లక్షల ఎకరాలను భూ సేకరణ ద్వారా రైతులు త్యాగం చేశారని, వాటి ద్వారా సీమలోని 14 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉన్నప్పటికీ కేవలం 2 లక్షల ఎకరాలకు మాత్రమే కాల్వల ద్వారా నీరు అందుతుందన్నారు. మరో 2 లక్షల ఎకరాలకు రైతులు ఇంజిన్ల సాయంతో నీరు తోడుకోవాల్సి వస్తుందన్నారు. మిగిలిన 10 లక్షల ఎకరాల రైతులు నీటి చుక్క కోసం ఆకాశం వైపు చూస్తున్నారన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాల్లో పెండింగ్‌లో ఉన్న 5 నుంచి 10 శాతం పనులు పూర్తి చేస్తే మొత్తం ఆయకట్టుకు నీరు అందించే అవకాశం ఉందన్నారు. కుందూనది విస్తరణ పేరుతో కొత్త భూసేకరణలు చేయడం అన్యాయమన్నారు. 24న నిర్వహించే సభకు ఆంధ్ర ఉద్యమాల ఐక్యవేదిక నాయకులు వడ్డె మహదేవ్, చైర్మన్ వడ్డె శోభానాద్రీశ్వరరావుతో పాటు కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వైఎస్‌రెడ్డి, ఏర్వ రామచంద్రారెడ్డి, వెంకటేశ్వరనాయుడు, మహేశ్వరరెడ్డి, సుధాకర్‌రావు, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి రూ.2 వేల కోట్లు కేటాయించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరాభివృద్ధికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు డిమాండ్ చేశారు. పాలకుల నిర్లక్ష్యంతో నగరాభివృద్ధి కుంటుపడిందని, కనీసం ప్రజలకు మంచినీళ్లు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఆదివారం కర్నూలు ఎంపీపీ హాలులో సీపీఎం న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన కర్నూలు నగరాభివృద్ధిపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బాబురావు మాట్లాడుతూ.. నగర జనాభా పెరిగిపోతున్నా అందుకు తగ్గట్లుగా పాలకులు, అధికారులు సదుపాయాల కల్పనలో విఫలమయ్యారని ఆరోపించారు. సీపీఎం నాయకులు ఎం.రాజశేఖర్, అంజిబాబు పాల్గొన్నారు.

బ్రహ్మానందీశ్వర ఆలయంలో కోయిల్ ఆల్వార్ తిరుమంజన సేవ



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని కోటా వీధిలో వెలసిన శ్రీబ్రహ్మానందీశ్వర స్వామి దేవస్థానంలో మన ఊరు–మన గుడి, మన బాధ్యత సభ్యులు కోయిల్ ఆల్వార్ తిరుమంజన సేవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు ఆలయ గోపురాలను శు భ్ర పరిచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గుంటూరు ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ 100 మందికి పైగా సభ్యులచే గుడిని శుభ్రం చేయడం జరిగిందన్నారు. అదే విధంగా పాత బడిన దేవుళ్ల ఫొటోలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తమ సభ్యులకు అందజేస్తే తాము వాటిని విసర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హరికృష్ణ, డాక్టర్ కార్తీకమ్మ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ

బండి ఆత్మకూరు: నంద్యాల – ఆత్మకూరు రహదారిలో బండిఆత్మకూరు సబ్ స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. నంద్యాల వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన లారీ వేగంగా ఢీకొనడంతో అదుపు తప్పి పక్కనే వరి పైరులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నారాయణాపురం గ్రామానికి చెందిన విష్ణు, బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రమణకు స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం తప్పిందని అక్కడున్న వారు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

జగతికి నాగరికత నేర్పిందే అమ్మ!



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: 'జగతికి నాగరికత నేర్పింది అమ్మ. అమ్మ చరితం పొగడటం ఎవరి తరం కాదు' అని పలువురు సాహితీ వేత్తలు అభిప్రాయపడ్డారు. సాహితీ సదస్సు, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ప్రముఖ పద్య కవి, రాష్ట్ర పతి అవార్డు గ్రహీత చేగిరెడ్డి చంద్రశేఖర రెడ్డి రచించిన 'మాతృ దర్శనం' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూరా, తెలుగు భాష వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భారతీయ సాహిత్యంలో ఇప్పటి వరకు అమ్మపై ఎంత మంది కవులు కవిత్వ రాసినా అంది నిత్య నూతనంగానే ఉంటుందన్నారు. తెలుగు ఉపాధ్యాయురాలు డాక్టర్ కె.చంద్రమౌళిని, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి పుస్తక సమీక్ష చేశారు. అనంతరం రచయిత కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. నరసం అధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీ వేత్తలు పోతన్న, వెంకట కృష్ణ, మారుతి, గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, బసరావరాజు, మధుసూదన శర్మ, శ్రీనివాసమూర్తి, డాక్టర్ హరికిషన్, ఎస్‌డీపీ అజీజ్ పాల్గొన్నారు.